


ఉగాది పోటీలో ఎంపికైన కథ

# ప్రశ్న?

- సాయిబ్రహ్మానందం గొర్తి

**ఆ** రోజుకి జరిగిన డబ్బు లావాదేవీలన్నీ పూర్తిచేసి జమా పుస్తకంలో రాస్తుండగా గాజు తలుపుల్ని కొడుతూ శబ్దం చేసింది ప్రియ. ఒక్కసారి తలెత్తి చూసింది అవని. కూర్చున్న చోటునుండి లేచెళ్ళి తలుపు తీసింది.

"ఇంకా ఈ లెక్కలు పూర్తి కాలేదా? అవనీ!" అని అంటూ, ప్రియ వచ్చే శనివారం తననీ, దివ్యనీ వాళ్ళింటికి డిన్నర్‌కి రమ్మనమని చెప్పింది.

అవనీ, ప్రియా అదే బ్యాంకులో దాదాపు ఆరేళ్ళనుండీ పనిచేస్తున్నారు. ప్రియకీ, అవనికీ చాలా స్నేహం.

"ఈ శనివారం కుదర్దు ప్రియా! సాయంత్రం నాలిగింటికి మెడినోవాలో డాక్టర్ని కలవాలి. చాలా రోజుల్నుండీ వాయిదా వేస్తున్నాను..."

"ఏమయ్యింది? దివ్యకి వంట్లో బాగో లేదా?"

"దివ్యకి కాదు, నాకే!"

ఈమధ్య అవని ఆరోగ్యం కాస్త మందగించింది. తరచు జ్వరం వస్తోంది. ఒక్కోసారి చాలా నీరసంగా ఉంటోంది. శారీరకంగా త్వరగా అలసిపోతోంది. అదే విషయం ప్రియకి చెప్పింది.

"అలసట శరీరంకంటే మనసుకే ఎక్కువయ్యిందనుకుంటాను. చంద్ర పోయినప్పటి నుండీ నువ్వు మామూలు మనిషివి కాలేకపోతున్నావు. అంతే! మనుషులు పోయినంత త్వరగా జ్ఞాపకాలు చెరిగిపోవు. అవనీ".


అదేం కాదన్నట్లు తలూపింది అవని. చంద్ర పోయిన బాధ కొత్తలో ఉందేమో కానీ ఇప్పుడు లేదు. ఇంకో నెల్లాళ్ళల్లో అతని సంవత్సరీకం కూడా వస్తోంది. అతని నిష్క్రమణ అవని జీవితంపై అంతగా ప్రభావం చూపలేదు. మానసికంగా దేన్నైనా తట్టుకోగల ధైర్యంవున్నా శరీరమే సహకరించడం లేదు.

"మీ అత్తగారూ, మావగారూ ఉన్నారు కదా, రప్పించుకో! ఏం? మీ ఆయన పోయాక వాళ్ళూ వాటాలు తీసుకున్నారు కదా?"

ఆమెకు తెలుసు, వాళ్ళు వాటాలు తీసుకోలేదని. ఒక్కగానొక్క కొడుకూ పోతే వాళ్ళకి ఆధారంకోసం తనే ఇచ్చింది. రాజమండ్రి దగ్గర పల్లెటూర్లో వాళ్ళ మానాన వాళ్ళు బ్రతుకుతున్నారు. అదే చాలు తనకి. అవని సమాధానం చెప్పలేదు.

"సరే! అయితే నే వస్తాను. పోనీ ఆ పై శనివారమైనా రా! నువ్వు వస్తావని రమేషుక్కూడా చెప్పాను. ఇలా "కుదరదు"అని చెబుతావని ఊహించలేదు."

అవని కాస్త నొచ్చుకుంది.



"అలా అనకు ప్రియా! ఆపై వారం తప్పకుండా వస్తాను. నాకు నువ్వు తప్ప ఎవరున్నారు చెప్పు?" ప్రియ చేతులు పట్టుకుంది అవని. వెళ్ళొస్తానని చెప్పి బయల్దేరింది.

అవని కూడా తన పని ముగించుకొని ఇంటి ముఖం పట్టింది.

* * *

అవని ఇంటికొచ్చేసరికి కాస్త ఆలస్యం అయ్యింది. రోజూ ఆటోలో వచ్చినా రోడ్లన్నీ రద్దీగా ఉంటాయి. సాయంత్రం ఎంత లేదనుకున్నా గంట పట్టేస్తోంది.

తలుపు తట్టగానే రాజి తలుపు తీసింది.

"ఏం ఆంటీ! ఆలస్యం అయ్యిందా?"

ఆ అపార్ట్‌మెంట్‌లో రాజి వాళ్ళు రెండో అంతస్థులో ఉంటారు. అవనీ వాళ్ళది నాలుగో అంతస్థు. రాజి దివ్యకి రోజూ వచ్చి హోంవర్కు సాయం చేస్తుంది.

"ఆ! చచ్చేంత రద్దీ, జనం. రోజూ ఇదే వరస." చెప్పులు విప్పి గూట్లో పెడుతూ అంది అవని.

దివ్య తలెత్తకుండా చదువుకుంటోంది. తల్లి వచ్చాక ఓసారి తలెత్తి చూసిందంతే!

బాత్‌రూంకెళ్ళి ముఖం కడుక్కొచ్చింది అవని.

"ఆంటీ! మీకో న్యూస్ చెప్పాలి. వచ్చే గురువారం పెళ్ళివారొస్తున్నారు. నాకయితే అస్సలు ఇష్టంలేదు. ఎంత వద్దని చెప్పినా మా నాన్న వినేట్లా లేడు."

తండ్రిపై చికాకు రాజి మాటల్లో ప్రతిధ్వనించింది.

రాజి ఇంజనీరింగు పూర్తిచేసింది. అమెరికా వెళ్ళి చదవాలని ఆమెకి అభిలాష. కానీ రాజి తండ్రికి మాత్రం పెళ్ళిచేసే పంపేయాలన్న ఆరాటం.

"ఓ అలాగా! తలుపు తీయగానే నీ ముఖం అంతగా వెలిగిపోతోందేమిటా అనుకున్నాను. ఇదన్నమాట సంగతి. ఇంతకీ ఇది అమెరికా సంబంధమా?"

"మీకూ ఆట పట్టింపులా ఉందా ఆంటీ? చదువుకుంటాను అమెరికా వెళతాను అంటే నాన్న అస్సలొప్పుకోవడం లేదు. ఆ వచ్చే పెళ్ళికొడుకైనా అమెరికావాడా అంటే అదీ కాదు. నాన్న స్నేహితుడొకాయన ఢిల్లీలో పెద్ద బిజినెస్ మేగ్నెట్టట. వాళ్ళబ్బాయి. నాకయితే అస్సలు ఇష్టం లేదు."

"ఏం బిజినెస్ వాళ్ళయితే చేసుకోవా?" అవని ప్రశ్నించింది.

"అది కాదు ఆంటీ! అతను కనీసం ఇంజనీరింగ్ కూడా కాదు. మరీ బొత్తిగా బీకాం చేసాడట. నాన్న వాళ్ళకి చాలా బిజినెస్సులున్నాయి. కావాలంటే నువ్వు అక్కడే ఉద్యోగం చెయ్యొచ్చు అంటున్నారు. నాకయితే అమెరికా వెళ్ళి ఎంఎస్ చేయాలని ఉంది..."

పెళ్ళయ్యేసరికి చంద్రంకంటే తనకి జీతం ఎక్కువ. డిగ్రీ కూడా ఎక్కువే. నాన్నకి తన పెళ్ళి భారం కాకూడదని సర్దుకుంది. ఇప్పటి తరానికీ, మా తరానికీ ఆలోచనల్లోనూ ఎంత తేడాయోకదా అని అనుకుంది అవని. ఇప్పటి అమ్మాయిలకి వాళ్ళకేం కావాలో ఖచ్చితంగా తెలుసు.

దివ్యకి రేపు సైన్సు పరీక్ష ఉంది. ఉందని చెబుతూ తన పెళ్ళిచూపులకీ రమ్మనమంది రాజి.

"పెళ్ళిచూపులకి మీరూ రండి ఆంటీ. మీరు ఆ వచ్చే మేగ్నెట్‌ని చూద్దురుగాని."

"అలాగే! బ్యాంకునుండి త్వరగా ఊడిపడితే వస్తాను." నవ్వుతూ అంది అవని.

కాసేపయ్యాక రాజి పనుందని వాళ్ళింటికెళ్ళిపోయింది. ఆ రాత్రికి వంట నిమిత్తమై వంటింట్లోకి అడుగుపెట్టింది అవని.

* * *

"నిన్న శనివారం, మీ టెస్ట్ రిపోర్టులొచ్చాయి. అవన్నీ చూసేకా మీకు తరచు జ్వరం రావడానికి కారణం తెలిసింది. కావల్సిన పరీక్షలన్నీ చేసేకనే ఈ నిర్ధారణకి వచ్చాం. మీవారు..."

చందు పోయి పది నెలలు దాటింది. తనూ దివ్యా ఉంటున్నారని చెప్పింది.

"అయాం సారీ! పోనీ మీ అమ్మా, నాన్నా కానీ, లేదా మీ అత్తా మావలు కానీ ఉన్నారా? వాళ్ళకి చెబితే..."

అవనికి కాస్త కంగారు మొదలయ్యింది. పరవాలేదు తనకి చెప్పమని ప్రాధేయపూర్వకంగా అడిగింది.

"అలా కాదు. మేం ఏదీ డైరెక్ట్‌గా పేషంట్‌కి చెప్పకూడదు. అందులోనూ మీకొచ్చింది... ప్లీజ్ మీ వాళ్ళకి మేం ముందు తెలియపరుస్తాం. వాళ్ళు మీకు చెప్తారు." డాక్టర్ కాస్త కటువుగానే చెప్పాడు.

విషయం చెప్పడం లేదని అతనిపై కోపం వచ్చింది. అది అణగతొక్కుకుంటూ, వాళ్ళ సెల్ నెంబరు చెప్పింది. డాక్టర్ నోట్ చేసుకున్నాడు.

"డాక్టర్! ప్లీజ్, నేనేమీ బెంబేలు పడిపోను. నాకు ధైర్యం ఎక్కువే! కాస్త చెప్పండి. మీరు నాకు చెప్పక పోతే తట్టుకోలేను..." ప్రాధేయపడింది అవని.

"మీకు చెప్తాం. కంగారు పడకండి. మీవారు ఏం చేసేవారు? ఎలా పోయారు?"

"ఆయన సినిమా స్టూడియోలో ఎడిటర్‌గా పనిచేసేవారు. ఓసారి హఠాత్తుగా జ్వరం వచ్చింది. ముందు మలేరియా అన్నారు. తరవాత టైఫాయిడ్ అన్నారు. ఓరోజు హఠాత్తుగా పోయారు. హార్ట్ ఎటాకని అన్నారు... ఏం? ఇవన్నీ అడుగుతున్నారు?"

"మీ రిపోర్టు చూసాకా మాకు అనుమానం వచ్చి మీ ఫేమిలీ డాక్టర్ని కనుక్కున్నాం. ఆయన మీవారు ఎందుకుపోయారో స్పష్టంగానే చెప్పారు."

"అలాగా! మీరు డాక్టర్ రావుగార్ని సంప్రదించారా?"

అవునన్నట్లు తలూపుతూ డాక్టర్ రావుకి అన్నీ తెలుసుననీ, అవని అత్తమామలకీ ఆయన విషయం చెప్పారని చెప్పాడు. అవనికిదంతా అయోమయంగా ఉంది.

అత్తమావలకి తెలుసుననీ తనకు తెలీదు. మాటవరసకి కూడా వాళ్ళెప్పుడూ తన దగ్గర అనలేదు.

"చాలా ఆశ్చర్యంగా ఉంది. మీకు తెలియదు అంటే. మీవారు ఎలా పోయారంటే..." డాక్టర్ మౌనంగా ఉండిపోయాడు.

"ఎలా పోయారు...?"

"ఎయిడ్స్!"

ఆ మాటలు వింటే అవని నెత్తిమీద పిడుగు పడ్డట్లయ్యింది. మెదడంతా స్తబ్దుగా అయిపోయింది.

"బహుశా మీకు మీ వారి..."

అవనికేం వినిపించడం లేదు. కళ్ళలో నీళ్ళు రావడం లేదు. ఒక్కసారి దివ్య గుర్తుకొచ్చింది.

"అంటే... నాకూ..." కాళ్ళక్రింద భూమి చీలిపోతుంటే అప్రయత్నంగా అంది అవని.

డాక్టర్ అవునన్నట్లు తలూపాడు.

* * *

రెండురోజుల తర్వాత అవని అత్తగారు, మావగారు రాజమండ్రి నుండి చెప్పాపెట్టకుండా వచ్చారు. డాక్టర్ రావుగారు కానీ, మెడినోవా డాక్టర్ కానీ ఫోన్ చేసి ఉంటారని అర్థంఅయ్యింది అవనికి. వాళ్ళకి భర్త గురించి తెలిసీ తనకి ఎందుకు పోయాడో నిజం చెప్పకుండా దాచినందుకు కసీ కోపం పెరిగిపోతోంది. అందుకే అంతగా మాట్లాడలేదు.

ముభావంగా, ముక్తసరిగా పలకరించింది. అత్తగారే కల్పించుకొని మాట్లాడినా అవని జవాబివ్వలేదు.

చంద్రం ఎలాగూ పోయాడు. కానీ ఎలా పోయాడో తన దగ్గర దాచాల్సిన అవసరం ఏం వచ్చిందన్న ఆలోచనే తట్టుకోలేకపోతోంది. ఆ రాత్రి దివ్య పడుకుంది అన్న నిర్ధారణకొచ్చాక మావగారే విషయం లేవదీసాడు.

"డాక్టర్ రావుగారు చెప్పారమ్మా! విషయం తెలిసింది. మేం దివ్యని మా దగ్గర అట్టేపెట్టుకుంటాం. అది అడుగుదామనే వచ్చాం."

మావగారి మాటలకి ఒక్కసారి కోపం దహించుకుపోయింది అవనికి.

"ఇప్పుడు మీరు దివ్యని చూసే అవసరం ఎందుకొచ్చింది? అయినా రోగం వచ్చింది నాకు. దివ్యకి కాదు."

"అది కాదమ్మా! నా మాట విను. ఆవేశం వద్దు. దివ్యని మాదగ్గర ఉంచుకొని చదివిస్తాం..." మళ్ళా అవే మాటలు.

తనకున్నది దివ్య ఒక్కత్తే! అయినా తనకొచ్చిన వ్యాధి ప్రిలిమినరీ స్టేజీలోనే ఉంది. వీళ్ళ వ్యవహారమంతా చూస్తే, తనేదో చావడానికి సిద్ధంగా ఉన్నట్లుంది. మావగారు మౌనంగా ఉండిపోయాడు. అత్తగారే నసుగుతూ అంది.

"అది కాదు అవనీ, ఇది అంటురోగం అని..."

"ఇది అంటువ్యాధని మీకెవరు చెప్పారు? అయినా ఇది నాకు మీ సుపుత్రుడి వల్లే వచ్చింది. మీ అబ్బాయి చేసిన నిర్వాకానికి నేను శిక్ష అనుభవిస్తున్నాను. ఆయనా ఒక్కసారి కూడా నిజం చెప్పలేదు. ఎప్పుడూ నయ వంచనే! దివ్య మీతో రాదు. నా బ్రతుకు నేను బతగ్గలను. నాకొచ్చే జీతంతో దర్జాగా బ్రతుకుతాను. వైద్యం చేయించుకుంటాను." కుండబద్దలు కొట్టినట్లు చెప్పింది అవని.

"అయితే..." మావగారు ఏదో చెప్పబోతుంటే అడ్డుకొంది అవని.

"చెప్పానుకదా! మీరు రేపు ఉదయమే వెళ్ళచ్చు. మీరు ఈ విషయంలో తల దూర్చడం అంత మంచిది కాదు" తెగేసి చెప్పేసింది అవని.

రాత్రంతా నిద్ర పట్టలేదు. అసలు ఎయిడ్స్ అంటువ్యాధని ఎవరు చెప్పారు? అవగాహన లేక ఇలా వాళ్ళూవీళ్ళూ చెప్పిన తప్పుడు మాటలు ఒక్కోసారి మనుషుల్ని దుర్మార్గంగా ఆలోచించడానికి ప్రేరేపిస్తాయి. దివ్యొక్కతే తనకున్న ఆశ. ఒక్కోసారి రోగం బాధకన్నా, చుట్టూ ఉండే వాళ్ళవల్ల వచ్చే బాధలే ఎక్కువగా బాధిస్తాయి.

ఆ మర్నాడు తెల్లారేసరికి మావగారూ అత్తగారూ చెప్పాపెట్టకుండా వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళినందుకు అవనికి కాస్త ఉపశమనమే కల్గింది.

* * *

ఆరోజు సాయంత్రం ఆఫీసునుండి వస్తుంటే అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ అవనికేసి అదోలా చూసాడు. లిఫ్ట్ దగ్గర రాజి వాళ్ళమ్మ కనిపించింది. రాజి పెళ్ళిచూపుల విషయం అడుగుతున్నా విననట్లు నటిస్తూ, చూసీ చూడనట్లు మొహం తిప్పుకొని వెళిపోయిందావిడ. అవనికి వాళ్ళ ప్రవర్తన వింతగా అనిపించింది.

తలుపు తట్టగానే, దివ్య తలుపు తీసింది. ఎప్పుడూ రాజి తలుపు తీస్తుంది. అలాంటిది ఇవాళ రాలేదా? అనుకుంటూ లోపలికొచ్చింది.

"ఏం? ఇవాళ రాజీ రాలేదా?"

"రాలేదు. ఇహ రేపట్నుండి మనింటికి రావడం కుదర్దని రాజి వాళ్ళమ్మగారూ నీకు చెప్పమన్నారు... రాజీ అక్కతో నన్ను మాట్లాడొద్దని చెప్పారు... అమ్మా నన్ను అపార్ట్‌మెంట్‌లో పిల్లలూ ఆడుకోడానికి రావద్దన్నారమ్మా... మనది ఎయిడ్స్ ఫ్యామిలీట కదమ్మా!... ఎయిడ్స్ అంటే ఏమిటమ్మా...?" ఏడుస్తూ అంది దివ్య. ఒక్కసారి అవాక్కయ్యింది అవని.

దివ్యని పంపను అన్నదానికి నిరసనగా అత్తగారూ మావగారూ చేసిన నిర్వాకమన్న మాట ఇది.

దివ్య అలా అడిగేసరికి ఒక్కసారి కన్నీళ్ళొచ్చాయి అవనికి.

రాజి వాళ్ళమ్మ వింత ప్రవర్తనా, వాచ్‌మెన్ అదో రకం చూపులకీ కారణం తెలిసింది. తను ఎవరికీ సమాధానం చెప్పదల్చుకోలేదు. ఆ రాత్రి దివ్యకి విపులంగా ఎయిడ్స్ గురించి చెప్పింది అవని. ఈ అపార్ట్‌మెంట్ దాటి ఆ వార్త దివ్య స్కూల్‌కి ఎప్పుడో చేరిపోయే ఉంటుందని ముందే ఊహించింది. అందరు అడిగే తలనొప్పి ప్రశ్నలకెలా సమాధానం చెప్పాలో చెప్పింది.

తను రోగంనుండి బయట పడచ్చేమో కానీ ఈ తిరస్కారాల నుండి బయట పడడం అసాధ్యం. అంతకంటే తనేమీ చేసే స్థితిలో లేదు.

మరణం ఎలాగూ తప్పదని తెలిసినప్పుడు ఎదురీదితే నష్టపోయేదేమీ లేదు.

* * *

ఆ మర్నాడు ఆఫీసుకెళ్ళేసరికీ తనకొక వింత అనుభవమే ఎదురయ్యింది. ఎప్పుడూ రాసుకుపూసుకు తిరిగే ప్రియ మాట్లాడడం మానేసింది. ఆఫీసులో అందరి ప్రవర్తనా చూసి నవ్వొచ్చింది అవనికి. మేనేజరయితే తన సీటు మార్పించాడు. తనని క్యాషియర్ కౌంటర్లోంచి తప్పించి, వేరే గదిలో సీటు ఇచ్చాడు. తన చుట్టూ ఉన్న మనుషులందరికీ ఉన్న రంగుల పొరల్ని తొలగించి అసలు రూపాల్ని వెలికి తీస్తోంది తనకొచ్చిన రోగం. మానసిక వ్యాధిగ్రస్తులతో నిండిన ఈ సమాజంలో (మిగతా 19వ పేజీలో)

అసలు ఎయిడ్స్ అంటువ్యాధని ఎవరు చెప్పారు? అవగాహన లేక ఇలా వాళ్ళూవీళ్ళూ చెప్పిన తప్పుడు మాటలు ఒక్కోసారి మనుషుల్ని దుర్మార్గంగా ఆలోచించడానికి ప్రేరేపిస్తాయి. దివ్యొక్కతే తనకున్న ఆశ. ఒక్కోసారి రోగం బాధకన్నా, చుట్టూ ఉండే వాళ్ళవల్ల వచ్చే బాధలే ఎక్కువగా బాధిస్తాయి.

## పిల్లలు కాదు పిడుగులు

అమెరికాలోని ఒక పెద్ద స్కూల్లో ఆ బాలిక చదువుతోంది. వయస్సు 12 సం.రాలు. స్కూలువాళ్లు ఆమెకు ఒక ప్రాజెక్టును అప్పగించారు. ఆ కార్యక్రమం వలన ఆ బాలికకు తెలిసింది- తమ స్కూల్‌కు ఒక పెద్ద కంపెనీవారు సప్లయ్ చేస్తున్న లంచ్ బాక్స్‌లు ప్రమాదకరమైనవని. ఆ లంచ్ బాక్స్‌లు పాలిస్టిరిన్‌తో తయారవుతున్నాయి.

ఆ చిన్నారి ఒక మీల్స్ టేబుల్‌మీద నిలబడి తన సాటి పిల్లలందరికీ ఆవేశంతో ఆ విషయాన్ని చెప్పింది. వారంతా స్కూల్ లంచ్‌ను తిరస్కరించారు. ఆ బాక్స్‌లు నిషేధించాలనీ, తమ ఆరోగ్యానికి చెరుపుచెయ్యని బాక్స్‌లు అందచెయ్యాలని, ఆమె తమ స్కూల్లోని ఇతర తరగతుల విద్యార్థులందరికీ చెప్పింది.

వారంతా ఏకమై ఆ స్కూల్ యాజమాన్యంపై తీవ్రమైన వత్తిడి తెచ్చారు. తాము లంచ్‌కు వెళ్లకుండా నిరాహారదీక్ష చేశారు. ఆ బాలిక తమ స్కూల్‌కు లంచ్ బాక్స్‌లు సరఫరాచేసే కంపెనీకి తనవెంట వంద మంది బాలికలను తీసుకువెళ్లింది. ఆ కంపెనీ డైరెక్టర్‌ను కలుసుకొని, "మా స్కూల్లోని విద్యార్థులం అందరం, మీ లంచ్ బాక్స్‌లను తిరస్కరిస్తున్నాం. ఆ బాక్స్‌లకు బదులుగా మీరు మా ఆరోగ్యానికి చెరుపుచెయ్యని సిరామిక్ ప్లేట్స్‌ను సప్లయ్ చేసేంతవరకూ మేమంతా లంచ్ తీసుకోము!" అంటూ ఎంతో ఆవేశంతో తన గుప్పిళ్లు బిగించి మరీ చెప్పింది. అందరూ బాలికలూ గళమెత్తి గుప్పిళ్లు బిగించి నినాదాలు చేశారు. చివరికి ఆ కంపెనీ డైరెక్టర్ ఆ బాలికలకు దాసోహం అనక తప్పలేదు. అటుపిమ్మట వారి స్కూల్‌కు సిరామిక్ ప్లేట్లు పంపసాగాడు. ఒక రోజున ఆ స్కూల్ పిల్లలందరినీ తన కంపెనీకి ఆహ్వానించి వారికి చక్కటి విందు ఇచ్చి, వారికి ఉపయోగకరమైన కానుకలు ఇచ్చి, 'జరిగిన దానికి నాకు చాలా బాధగా ఉంది. అందుకు మీ అందరికీ నా క్షమాపణ చెప్తున్నాను!' అన్నాడు.

**- కొడిమెల**

**(9వ పేజీ తరువాయి)**

ప్రస్తుతం తన శరీరం అంటరానిది.

❊ ❊ ❊

ఓ రెండురోజుల తర్వాత, ఓ సాయంత్రం లిఫ్ట్ దగ్గర రాజి కనిపించింది. ముందు తనే చూసి నవ్వింది అవని. రాజి తలదించుకొని వెళ్లిపోయింది.

తనే ఏదో చెప్పాలని అడగబోయింది. రాజి వడివడిగా అడుగులు వేసుకుంటూ వెళిపోయింది.

తమిద్దర్నీ గమనిస్తూనే ఉన్నాడు వాచిమెన్ నర్సి. ఆ తరువాత చిన్న పనిమీద బయటకొచ్చినప్పుడు, నర్సే అన్నాడు.

"ఏందమ్మా? రాజమ్మ కూడా మీతో మాట్లాడ్డం మానేసిందా?"

అంటే మిగతా అపార్ట్‌మెంట్‌లో వాళ్లెవరూ మాట్లాడడం లేదని నర్సికీ తెలిసి పోయిందన్నమాట. అవునన్నట్లు తలూపింది.

"నాకు తెలుసమ్మా, రాజీ మీతో ఎంత చనువుగా ఉండేదో? మీ అమ్మాయిలా ఎప్పుడూ మీ ఇంట్లోనే ఉండేది. అమ్మా మీకో విషయం తెలుసా, రాజమ్మగారి పెళ్లి చెడిపోయిందట."

రాజి పెళ్లి కుదిరిందనీ క్రితంసారి నర్సే చెప్పాడు. ఏమాత్రం ఉత్సుకతా చూపించకుండా "అలాగా"అని మాత్రం అంది అవని.

అంతకంటే ఏం అడుగుతుంది? ప్రస్తుతం తనొక అంటరాని వ్యక్తి. తనేమీ నేరం చేయకపోయినా నేరస్థురాలుగా పరిగణించబడుతోంది. తన చుట్టూ ఉన్న వాళ్ళు మాట్లాడకపోవడం బాధించడం లేదు. తనని చూసి తల తిప్పుకోవడాలూ, చూసీచూడనట్లు నటించడాలూ చూస్తే చికాకేస్తోంది. తను ఈ ప్రపంచాన్ని మార్చలేదు. తనని తను మాత్రమే మార్చుకోగలదు. అదొక్కటే తన చేతిలో ఉంది.

❊ ❊ ❊

ఓరోజున అవనికి వంట్లో నలతగా ఉందనిపించింది. అంతకుముందు రోజు రాత్రి కాస్త చలీ జ్వరమూ వచ్చాయి. బ్యాంకుకి లీవుపెట్టి ఇంట్లోనే ఉండిపోయింది. దివ్య స్కూల్‌కెళ్ళింది. మంచంమీద నడుం వాల్చి, ఏమీ తోచక చలం కథల పుస్తకం చదువుతోంది.

ఇంతలో కాలింగ్‌బెల్ మోగింది. ఎవరొచ్చారా అనుకుంటూ తలుపు తీసింది అవని. ఎదురుగా రాజి. ఉత్తప్పుడు దూసుకుంటూ లోపలొకొచ్చే రాజి అక్కడే నిలబడిపోయింది. అవనికీ ఏం మాట్లాడాలో తెలీలేదు. రాజి తల దించుకునే అంది.

"లోపలికి రావచ్చా ఆంటీ?"

"తప్పకుండా రాజీ, మా ఇంటికి రావడానికి అనుమతి అవసరం లేదు, ముఖ్యంగా నీకు..."

లోపలికి వచ్చింది కానీ, ఇద్దరి మధ్యా మాటలు లేవు. రాజి మొదలుపెడితే అవనీ, అవని మొదలుపెడితే రాజీ మాట్లాడుదామా అని ఎదురు చూస్తున్నారు. రాజి సోఫాలో కూర్చుంది.

ఒకప్పుడు వాళ్లిద్దరి మధ్య జలపాతంలా సాగే మాటలు ప్రస్తుతం గాలిలోనే ఆగిపోయాయి. చివరికి అవనే అంది.

"ఏంటి? విశేషాలు?"

"మీ గురించి విన్నాను. ఐయాం సారీ ఆంటీ... నా.పెళ్ళి ఆగిపోయింది తెలుసా?"

"అలాగా?" తనకి తెలుసున్నా తెలీనట్లుగా అంది అవని.

"రెండువారాల క్రితం వచ్చి చూసెళ్ళారు. అబ్బాయి చూడ్డానికి బాగానే ఉన్నాడు. నాన్న బలవంతమ్మీద ఒప్పుకున్నాను. తాంబూలాలొకటే మిగిలాయి. అతనూ నేనూ సినిమాక్కూడా వెళ్ళాం. అయినా..." అవని వింటోంది. ఏం మాట్లాడాలో తెలీలేదు.

"అంతా సవ్యంగా అవుతోంది అనుకుంటూండగా... నావల్లే ఈ పెళ్ళి ఆగిపోయింది..."

"నీవల్లా? కట్నాలూ అక్కడ కుదరలేదా?"

"ఆ అబ్బాయివల్ల కాదు, నావల్లే ఆగిపోయింది..."

"ఏం కట్నం తీసుకుంటున్నారని నిలదీసావా?" అవనికి రాజి మొండితనం, ధైర్యం తెలుసు. లేదన్నట్లు తలూపింది రాజి.

"మరి?..."

"అతన్ని ఎయిడ్స్ టెస్ట్ చేయించుకుంటేనే పెళ్ళి చేసుకుంటానని చెప్పా..."

అవనికొక్కసారి మాటలు రాలేదు. ఆశ్చర్యపోయింది.

"ఆంటీ... మీ గురించి విషయం తెలిసింది. మీకొచ్చిన కష్టం కళ్ళారా చూసాను. మీరు తప్పుచేయకపోయినా మీవారి వల్ల మీకొచ్చిందని తెలుసు. మీకిలా వచ్చిందని తెలిసాక అందరం ఎలా ప్రవర్తిస్తున్నారో కళ్ళారా చూసాను. అందుకే..."

"నువ్వు అతన్ని అలా టెస్ట్ చేయించుకోమనడం తప్పు కాదూ? అది వాళ్ళ కేరక్టర్ని శంకించినట్లు కాదూ?"

"కేరక్టర్ని ప్రశ్నించడం ఎలా అవుతుంది ఆంటీ? కలిసి జీవించబోయే జీవితానికొక నమ్మకం. 'తప్పు చేయను'అన్న ధీమా ఉన్న వ్యక్తయితే టెస్ట్ చేయించుకోవడం అంత పెద్ద సమస్య కాదు. నేనలా అడిగేసరికి అతనే కాన్సిల్ చేసేసాడు. నాన్న అప్పట్నుండీ నాతో మాట్లాడ్డం మానేసారు. ఇందులో నా తప్పేముంది చెప్పండాంటీ?"

ఈ పురుషాధిక్య సమాజం ఆడదాని శీలానికే పవిత్రత కోరుకుంటుందన్న చిన్న విషయం రాజికి తెలిసుండదని అనుకుంది అవని.

"నిన్నో విషయం అడగొచ్చా?" "ఊ" అన్నట్లు తలూపింది రాజీ.

"ఒకవేళ అతను ఎయిడ్స్ టెస్ట్ చేయించుకోవడానికి రెడీ అయ్యాడనుకుందాం. మరి నువ్వుకూడా రెడీ అన్నది చెప్పావా?"

"నేను రెడీయే ఆంటీ. నా ప్రోబ్లమల్లా పెళ్ళితరవాత మోసపోకూడదనే! ఈ చిన్న విషయానికి పెద్ద రాద్ధాంతం చేసాడతను.. పోనీండి. ప్రేమ నిలబడేది నమ్మకం పైనే ఆంటీ. ఆ ఒక్క మెట్టుదగ్గరే అతను వెనుకడుగు వేస్తే, పెళ్ళయ్యాక ఎన్ని తప్పటడుగులు వేయాల్సొస్తుందోనన్నదే నా భయం."

అవనికి చంద్రం గుర్తుకొచ్చాడు.

"ఒకవేళ పెళ్ళి జరిగిన తర్వాత అతనికి చెడు తిరుగుళ్ళు అబ్బితే ఏం చేస్తావు? అప్పుడు విడాకులిస్తావా?"

"నా ప్రేమలో నిజాయితీ మీద నాకు నమ్మకముంది ఆంటీ... ఆడదాని శీలం పవిత్రంగా ఉండాలని కోరుకునే మొగాడే ఇది ఒప్పుకుంటాడు. ఆ మాత్రం నిజాయితీ చాలు ఆంటీ, తప్పు చేయనీయకుండా ఆపగలదు."

రాజి ఆత్మవిశ్వాసం, నమ్మకం చూస్తే అవనికి ఆశ్చర్యం కలిగింది. తన జీవితం ఒకరికి పాఠం కాబోతోంది. తన సమస్య స్త్రీపురుష దాంపత్యంలో నిజాయితీని ప్రశ్నిస్తోంది. నవ్వొచ్చింది అవనికి.

"సారీ ఆంటీ, మీ గురించి తెలిసాకా అమ్మ మీతో మాట్లాడొద్దంది. నేను మిమ్మల్ని నొప్పిస్తే క్షమించండి... నాకు మీ ఇంటికి రాకపో ఉండలేకపోతున్నా ఆంటీ... ఎవరేమనుకున్నా నేను మీ ఇంటికొస్తా..."

చెబుతూంటే రాజి కళ్ళలో కన్నీటి పొర స్పష్టంగా కనిపిస్తోంది అవనికి. అవనికి దగ్గరగా వస్తూ, రాజే అంది.

"ఆంటీ... మిమ్మల్ని ముట్టుకోవచ్చా...?"

ఈసారి కన్నీళ్ళ వంతు అవనిది. ఒక్కసారి రాజిని దగ్గరకు తీసుకుంది. వెచ్చటి కన్నీళ్ళు రాజి భుజమ్మీద జలజలా రాల్తున్నాయి.

తన చుట్టూ ఉన్న పర్వతాలూ, కొండలూ అన్నీ దూదిపింజల్లా గాలిలో తేలుతున్నాయనిపించింది అవనికి.

★